నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
15 | హైదరాబాద్, మంగళవారం 26 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI



భువనగిరి గంజ్‌లో హోలీ ఆడుతున్న యువతులు



భువనగిరిలో హోలీ ఆడుతున్న చిన్నారులు

# వసంతోత్సాహం

**జిల్లా వ్యాపంగా సంబురంగా హోలీ వేడుకలు**

**రంగులు చల్లుకొని చిందులేసిన చిన్నాపెద్ద**

వసంత రుతువులో వచ్చే తొలి పండుగ హోలీ పండుగను జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. వాడవాడలా చిన్నా, పెద్ద రంగులు పులుము కొని సంతోషంగా గడిపారు. డప్పుళ్లు, డీజే పాటలతో డ్యాన్స్ చేశారు. కేరింతలు కొడుతూ ర్యాలీలు తీశారు. చిన్నారులు ఎక్కడ చూసినా బాటి ళ్లలో రంగులు నింపుకొని సిరంజీలు పట్టుకొని కనిపించారు. కాలనీలు, అపార్ట్‌మెంట్‌లలో సామూహిక వేడుకలతో పండుగ వాతావరణం నెలకొన్నది. పలుచోట్ల హోలీ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని అందరిలో ఉత్సాహం నింపారు.



భువనగిరిలో రంగులు పూసుకుంటున్న మహిళలు

# యాదగిరి గుట్టలో హోలీకోత్సవం



యాదగిరిగుట్టపై హోలీకోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మార్చి25 : యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో సోమవారం వసంతోత్స వాన్ని వైభవంగా నిర్వ హించారు. ప్రధానా యల మొదటి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూ ర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. చిలు కల పేర్లు వేసి ఉత్స వాన్ని ప్రారంభించారు. ఆలయ తిరుమాఢ వీధుల్లో హోలీ సేవను ఊరేగిం చారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రాకార మండపంలో వేంచేపు చేసి వేద పారాయణం నిర్వ హించారు. వసంతోత్సవం, హోలీ విశిష్టతను ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసిం హాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు భక్తు లకు వివరించారు. రంగులు చల్లుకొని వేడుకను జరిపారు. హోలీ పండుగతో పాటు సెలవుదినం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. తిరుమాఢ వీధులు, క్యూ లైన్లు, ప్రసాద విక్రయశాల ప్రాంతం భక్తులతో నిండి పోయింది. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యా ణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసిం హహోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవసే వను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతం తును చేపట్టారు. గంటన్నరకు పైగా జరిగిన కల్యా ణోత్సవాన్ని భక్తులు వీక్షించారు. అంతకుముందు తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవా ర్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామివారికి సహస్రనామార్చన చేప ట్టారు. సాయంత్రం తిరువీధి సేవ, దర్బార్ సేవను వైభవంగా నిర్వహించారు. పాతగుట్టలో స్వామివా రికి నిత్యారాధనలు ఘనంగా జరిగాయి. అను బంధ రామలింగేశ్వర స్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు.



ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కృతజ్ఞతా పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న నల్లగొండ లోక్ సభ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, ఆయన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

# ప్రజలతో మమేకమైతే విజయం సొంతం

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- కేసీఆర్‌ను కలిసిన కంచర్ల బ్రదర్స్

నల్లగొండ ప్రతినిధి, మార్చి25 (నమస్తే తెలం గాణ) : ఎన్నికల్లో ప్రజలతో మమేకం అయితే విజయం సొంతం అవుతుందని బీఆర్ఎస్ అధి నేత కేసీఆర్, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. రానున్న లోకసభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలుచున్న కంచర్ల కృష్ణారెడ్డి, ఆయన సోదరుడు నల్లగొండ మాజీ శాసనసభ్యుడు కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి సోమవారం సాయంత్రం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వా దాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కంచర్ల బ్రదర్స్ తమ అధినేతకు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ జిల్లాకు చెందిన సీనియర్ నేతలను కలుపుకొని ప్రణాళికా బద్ధంగా ఎన్నికల వ్యూహాన్ని రూపొం దించుకోవాలని ఉపదేశించారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పార్టీ యంత్రాంగాన్ని సమ న్వయం చేస్తారని ఆయన పేర్కొన్నారు.

అన్ని వర్గాలకు చెందిన నాయకులను మానిట రింగ్ చేసుకుంటూ పోతే తప్పక విజయం సాధిస్తా మని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమయం చాలా ఉందని, ప్రజలు ఇప్పటికీ బీఆర్ఎస్ వైపే ఉన్నారని, వారిని ఏకతాటి మీదకు తీసుకొచ్చి ఎన్నికల సమరాంగణంలో విజయం సాధించా లని కంచర్ల బ్రదర్స్‌కు గులాబీ బాస్ కేసీఆర్ ఉద్బో ధించారు.

## త్వరలో ముషంపల్లి, ఆలేరుకు కేసీఆర్

- ఎండిన పంటల పరిశీలన

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎండిన పంటల నష్టం వివరాలను స్వయంగా తెలుసుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి, గులాబీ బాస్ కేసీఆర్ రంగం లోకి దిగనున్నారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి గడిచిన వారం రోజులుగా ఎండిన పంటపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు సంబంధించిన నివేదికను అధినేతకు అందజేశారు. ఈ సందర్భంగా స్వయంగా వచ్చి క్షేత్ర స్థాయిలో జరిగిన నష్టాన్ని పరిశీలించాలని కేసీ ఆర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం రాత్రి తనను కలిసిన కంచర్ల బ్రదర్స్‌తో మాట్లాడి వివరాలు తెలు సుకున్నారు. నల్లగొండ మండలం ముషంపల్లితో పాటు ఆలేరు నియోజకవర్గ పరిధిలో పర్యటించా లని ఆయన నిర్ణయం తీసుకున్నారు. గడిచిన పది సంవత్సరాలు ఎండిపోని పంట పొలాలు ఈ మారు ఎందుకు ఎండి పోయాయో అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితిని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి వివరిస్తుంటే చలించి పోయిన కేసీఆర్.. తక్షణమే తానే స్వయంగా క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగి ఎండి పోయిన పంట పొలాలను పరిశీలిస్తానని తెలిపారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో మాట్లాడి రూట్ మ్యాప్ తయారు చేస్తామని కంచర్ల బ్రద ర్స్‌కు చెప్పారు. అత్యధికంగా బోర్లు వేసి నష్ట పోయిన నల్లగొండ మండలం ముషంపల్లి గ్రామం నుంచే ఈ పరిశీలన మొదలు పెట్టే విధంగా కార్య క్రమాన్ని రూపొందిస్తున్నారు.



సంస్థాన్ నారాయణపురంలో హోలీ ఆడుతున్న యువకులు



భూదాన్‌పోచంపల్లిలో హోలీ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

# రైతుల పొట్టగొట్టిన ప్రభుత్వం

- చివరి దశలో నీరందక ఎండిన వరి చేలు
- నాగార్జున సాగర్ నియోజకవర్గంలో 25 వేల ఎకరాల్లో పంట నష్టం
- చెరువులు, కాల్వల్లో నీరు లేక అల్లాడుతున్న పశుపక్షాదులు
- సాగర్ నీటిని విడుదల చేయాలని అన్నదాతల వేడుకోలు

## ఒక్క తడికి సాగు నీరందిస్తే పంటలు చేతికొచ్చేవి

హాలియా, మార్చి 25 : వర్షాలు లేక, చెరు వులు, కుంటలు ఎండిపోవడంతో జిల్లాలో తీవ్రమైన కరువు అలుముకున్నది. భూగర్భజ లాలు సైతం అడుగంటి చుక్కనీరు దొరుకని పరిస్థితి నెలకొన్నది. యాసంగిలో సాగు చేసిన వరి పొలాలు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. నాగార్జున సాగర్ ఎడమ కాల్వ నీరు రాకున్నా చాలా మంది రైతులు బోర్ల ద్వారా సాగు చేశారు. తొలుత బాగానే పోసినా ఆ తర్వాత నీటిమట్టం గణనీయంగా పడిపో యింది. మరోవైపు ఎండలు ముదరడంతో పంటలకు నీరందడం లేదు. ఒక తడికి సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తే పొట్ట దశకు వచ్చిన పంటలు చేతికొచ్చేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్ప టికే చాలా వరిచేలు ఎండిపోగా ఆలస్యంగా వేసిన పంటలను దక్కించుకునేందుకు నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

### 25 వేల ఎకరాల్లో ఎండిన వరి చేలు

నాగార్జున సాగర్ నియోజకవర్గంలో ఈ ఏడాది యాసంగిలో బోరు, బావులు, చెరు వుల కింద 75 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. మొదట కరెంట్ కష్టాలు వెంటాడిన ప్పటికీ పొలాలను కంటికి రెప్పలా కాపాడు కుంటూ వచ్చారు. గత నెల వరకు వరిచేలు బాగానే ఉన్నాయి. పంట పొట్ట దశలో ఉండగా భూగర్భ జలాలు అడుగంటడంతో క్రమంగా ఎండిపోతున్నాయి. సాగర్ ఎడమ కాల్వకు వారం రోజులపాటు మొదటి జోన్ లోని రైతులకు సాగునీరు ఇస్తే పంటలు చేతికి వచ్చే అవకాశం ఉన్నది. మరోవైపు చెరువులు, కుంటలు నిండి ఎండాకాలంలో పశుపక్షాదు లకు నీటికి ఇబ్బంది లేకుండే. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. దాంతో నియోజకవ ర్గంలో ఇప్పటికే 25 వేల ఎకరాల్లో వరిపం టలు పూర్తిగా ఎండిపోయాయి. అనుముల మండలంలోని 15 గ్రామాల్లో పంటలు చేతి కందకుండా పోయాయి. పులిమామిడి, రామ డుగు, అనుముల, మధారిగూడెం, హాజారి గూడెం, చల్మారెడ్డిగూడెం, పుల్లారెడ్డిగూడెం, కొట్టాల సూరేపల్లి గ్రామాల రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఎండిన వరి చేలను చేసే దేమీ లేక రైతులు పశువులను మేపుతున్నారు.



అనుముల మండలం చల్మారెడ్డిగూడెంలో నీళ్లు లేక ఎండిపోయిన వరిచేను

## పంట ఎండిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఎకరానికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి పెట్టి ఈ యాసంగిలో బోర్ల కింద 10 ఎక రాల్లో వరి సాగు చేసిన. తీరా పంట చేతికి వచ్చే సమయంలో భూగర్భజలాలు అడుగం టిపోవడంతో పూర్తిగా ఎండిపోయింది. వడ గండ్ల వానకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తామన్నట్లుగానే, పంట ఎండిపోయిన రైతులకు కూడా నష్టప రిహారం చెల్లించి ఆదుకోవాలి. వడగండ్ల వానకు పంట దెబ్బతిన్న రైతులకు, నీరందక పంట ఎండిన రైతులకు పెద్ద తేడా ఏమీ లేదు. అంతిమంగా నష్టపోయింది రైతే. కాబట్టి ప్రభుత్వం పెద్దమనసుతో ఆలోచించి పంట ఎండిన రైతులను కూడా ఆదుకోవాలి.

– రావుల అంజయ్య, రైతు, చల్మారెడ్డిగూడెం, అనుముల మండలం, నల్లగొండ జిల్లా

## 8 ఎకరాల వరి ఎండిపోయింది



నాకున్న 5 ఎకరాలతోపాటు మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేసిన. గతేడాది బావిలో నీళ్లు ఉండడంతో ఈ సారి కూడా అట్లనే వేసిన. ఈ ఏడాది ఏఎంఆ ర్పీ కాల్వ రాకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. నీళ్లందక పొట్టదశకు వచ్చిన 8 ఎకరాల వరి పైరు ఎండిపోయింది. మొత్తం పొలం పెట్టుబడి కోసం రూ.2.50 లక్షల అప్పు చేసిన. ఇప్పుడేం చేయాలో గుండెల్లో గుబులు మొదలైంది. పదేండ్లుగా సాగునీటికి ఇంత ఇబ్బంది రాలె. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరి హారం ఇచ్చి ఆదుకోవాలి.

–కిశోర్‌రెడ్డి, బుడమర్లపల్లి, కనగల్ మండలం

# పిల్లలమర్రిలో ఘనంగా రథోత్సవం



పిల్లలమర్రిలో చెన్నకేశవస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సూర్యాపేట రూరల్, మార్చి 25 : మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో చెన్నకేశవ స్వామి 120వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున రథోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. దేవా లయం నుంచి గ్రామ పురవీధుల్లో రథంపై స్వామి వారి ఉత్సవ విగ్రహా లను ఊరేగించారు. అనంతరం హోలీ వేడుకలను జరుపుకొన్నారు. డీజే పాట లకు మహిళలు, యువత రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ ఉత్స హంగా గడిపారు.



లింగమంతుల స్వామిని దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

# ఓ లింగా.. ఓ లింగా


- వైభవంగా లింగమంతుల స్వామి కల్యాణం
- ఎర్రబెల్లి గట్టుకు పోటెత్తిన భక్త జనం

నిడమనూరు, మార్చి 25 : మండలంలోని ఎర్రబెల్లి లింగమంతుల స్వామి జాతర వైభవంగా జరుగుతున్నది. సోమవారం తెల్లవారు జామున మాణిక్యాల దేవి, లింగమంతుల స్వామి కల్యాణోత్సవాన్ని యాదవులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రెండేండ్లకోసారి నిర్వహించే జాతరలో భాగంగా తెల్లవారుజా మున లింగమంతుల స్వామికి యాటలను సమర్పించి మొక్కులు చెల్లించుకు న్నారు. డోలు వాయిద్యాల నడుమ కత్తులు, కటార్లతో యాదవులు గజ్జెలాగులతో నృత్యాలు చేశారు. శివ సత్తుల పూనకాలు.. ఓ లింగా.. ఓ లింగా అంటూ నామ స్మరణతో గట్టు పరిసరాలు మార్మోగాయి. జిల్లా నలుమూలల నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో దారులన్నీ కిక్కిరిసిపో యాయి. జాతర సందర్భంగా భక్తులకు తాగు నీటి కొరత ఏర్పడి ఇబ్బంది పడ్డారు. దీనికితోటు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఎర్రబెల్లి లింగమంతుల స్వామిని ఎమ్మె ల్యేలు కుందూరు జయవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డితోపాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

# రంజాన్ కానుకకు కత్తెరేనా..?

## ఈ సారి పంపిణీపై ఇంకా నిర్ణయం తీసుకోని ప్రభుత్వం

- తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదంటున్న అధికారులు
- గతంలో ముస్లింలకు కేసీఆర్ సర్కారు తోఫా పంపిణీ
- నాడు ఇఫ్తార్ విందులకు సైతం నిధుల విడుదల
- ఈ సారి మాత్రం పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



యాదాద్రి భువనగిరి, మార్చి 25 (నమస్తే తెలం గాణ) : చీర, జాకెట్, పంజాబీడ్రెస్ మెటీరియల్, లాల్చి, పైజామా మెటీరియల్.. ఇవీ ఏటా ముస్లిం లకు రాష్ట్ర ప్రభుత్వం అందించే రంజాన్ తోఫా. పవి త్రమైన పండుగ సందర్భంగా నాటి బీఆర్ఎస్ సర్కాకు కానుకల కిట్ అందించేది. కానీ ఈ సారి రంజాన్ తోఫా అమలుపై నీలినీడలు కమ్ముకు న్నాయి. అసలు తోఫా ఉంటుందా..? లేదా..? అనేది స్పష్టత లేదు. గతంలో ఇఫ్తార్ విందుల కోసం మసీదులకు సైతం నిధులు విడుదల చేసేది. ఈ సారి మాత్రం ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి సమాచారం, ఆదేశాలు లేవని మైనార్టీ సంక్షేమ అధికారులు చెబుతున్నారు.

### ఈ సారి ఉన్నట్టా..? లేనట్టా..?

బీఆర్ఎస్ పాలనలో ముస్లింలకు పెద్దపీట వేశారు. మైనార్టీల సంక్షేమం కోసం కేసీఆర్ సర్కారు అనేక పథకాలకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ అన్ని పండుగలకు సమాన ప్రాధాన్యం ఇచ్చారు. ఇందులో భాగంగా రంజాన్ పర్వదినం పురస్కరించుకొని అర్హులందరికీ రంజాన్ తోఫా అందించారు. ఆయా మండలాల మసీదుల కమిటీల ఆధ్వర్యంలో నిరుపేదలను ఎంపిక చేసే వారు. గిఫ్టులు ముందుగానే జిల్లాలకు వచ్చేవి. వాటిని నియోజకవర్గాలు, మండల కేంద్రాలకు తర లించేవారు. రంజాన్ ముందు దినాల్లోనే కానుకలు పంపిణీ చేసేవారు. ఇందుకోసం ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసే వారు. ఈ సారి ముస్లింల పవిత్ర ఉపవాసం ప్రారం భమై 13రోజులైంది. వచ్చే నెల 12 లేదా13 తేదీల్లో పండుగను నిర్వహించనున్నారు. నెలవంక ఆధా రంగా రంజాన్ తేదీని నిర్ణయిస్తారు. ఈ సారి కాను కల పంపిణీపై ఎలాంటి కార్యాచరణ రూపొందించ లేదు.

### గతేడాది 19,500 గిఫ్ట్‌లు పంపిణీ..

రంజాన్ సందర్భంగా గతేడాది ముస్లింలకు తోఫాను విజయవంతంగా పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19,500మందికి కానుకులను అందించారు. అందులో యాదాద్రి భువనగిరి జిల్లాలో 2,500, నల్లగొండలో 10,500, సూర్యా పేటలో 6,500 తోఫాలు ఉన్నాయి. తోఫాలో కుటుంబంలోని భార్యభర్తలతోపాటు వారి పిల్లలకు కూడా కొత్త దుస్తులను అందించారు. అంతే కాకుండా సేమియా, పంచదార కూడా పంపిణీ చేశారు.

### నాడు విందులకు నిధులు విడుదల

రంజాన్ సందర్భంగా ముస్లింలకు ప్రభుత్వం తర పున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఆనవాయ తీగా వస్తున్నది. ఆయా నియోజకవర్గాల్లో ప్రత్యేక కమిటీల ద్వారా నిధులను సంబంధిత కమిటీల బ్యాంక్ ఖాతాల్లో అధికారులు నిధులను జమ చేసే వారు. గతేడాది ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు గతే డాది రూ. 39లక్షలను ఖర్చు చేసింది. ఇందులో యాదాద్రి భువనగిరి జిల్లాకు రూ. ఐదు లక్షలను విడుదల చేసింది. ఈ నిధులతో ఎంపిక చేసిన మసీ దుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేసేది. మరోవైపు ఎన్నికల కోడ్ ఉందని, అందుకే ఇంకా నిర్ణయం తీసుకోలేదని పలువురు చెబుతుం డగా, ఇది కొత్త కార్యక్రమం కాదని, ఏటా కొనసా గుతున్నదని మరికొందని స్పష్టం చేస్తున్నారు. కేసీ ఆర్ తీసుకొచ్చిన కార్యక్రమం కావడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాదనలు వినిపి స్తున్నాయి. కానీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎలా గైనా అమలు చేస్తుందని ముస్లిం సంఘాలు విమర్శి స్తున్నాయి.

# సూర్యాపేటలో బంగారం, వెండి పట్టివేత

సూర్యాపేట రూరల్, మార్చి 25 : పార్లమెంట్ ఎన్నికల నిబంధనలో భాగంగా సోమవారం సూర్యాపేట లోని జనగాం క్రాస్‌రోడ్డులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రూరల్ ఎస్ఐ బాలునాయక్ ఆధ్వర్యంలో హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా విజయవాడకు వెళ్తున్న షేక్ నాగుల్‌మీరా కారులో 56 గ్రాముల బంగారం, 5 కేజీల వెండి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న బంగారం, వెండిని ఎన్నికల అధికారులకు అప్పగించామని, వాటి విలువ సుమారు రూ. 7.84 లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు.